క్లుప్తంగా

శ్రీకృష్ణాపురం గురుకుల విద్యార్థుల ప్రతిభ

ఆరిలోవ: శ్రీకృష్ణాపురం గురుకులంలో ఇద్దరు విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచారు. ఇక్కడ ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఇటీవల జరిగిన జేఈఈ మెయిన్స్ ఎంట్రన్స్ పరీక్ష రాశారు. ఈ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ పరీక్షలో ప్రసాద్ 85 పెర్సంటైల్, అరవింద్ 82 పెర్సంటైల్ సాధించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను ప్రిన్సిపాల్ రత్నవల్లి, అధ్యాపకులు అభినందించారు.

'ఉచిత ప్రవేశాలు సద్వినియోగం చేసుకోండి'

మద్దిలపాలెం : ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన బాలలకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఒకటో తరగతిలో విద్యా హక్కు చట్టం ప్రకారం ఉచితంగా కేటాయిస్తున్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ నరవ ప్రకాశరావు సూచించారు. 2024 – 25 సంవత్సరానికి ఉచిత ప్రవేశాలకు సంబంధించి జీవో నంబర్ 6ను రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు జారీ చేశారని పేర్కొన్నారు. అర్హులైన వారు ఇష్టమైన ప్రైవేట్ పాఠశాలలో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశం పొందవచ్చని ఆయన సూచించారు.

రెడ్‌క్రాస్ హోమ్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 17వ వార్డు దలైవారి వీధిలో ఉన్న రెడ్‌క్రాస్ హోమ్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో నిరాశ్రయులకు దశాబ్దాలుగా ఈ హోమ్ సేవలు అందుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఇక్కడ షెల్టర్ పొందుతున్న వారికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్, కార్యదర్శుల ఆదేశాల మేరకు శిబిరం నిర్వహించినట్లు హోమ్ మేనేజర్ మురళి తెలిపారు. రెడ్‌క్రాస్ సంస్థ డాక్టర్లు బీవీవీ ప్రసాద్, రాజ్ కుమార్ నిరాశ్రయులకు వైద్య సేవలు అందించారు. బీపీ, షుగర్‌తోపాటు వారి వ్యక్తిగత సమస్యలకు అనుగుణంగా పరీక్షలు చేసి ఔషధాలు అందజేశారు. షెల్టర్‌లో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు ఈ సేవలను వినియోగించుకున్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ

మద్దిలపాలెం : జేఈఈ మెయిన్స్ 2024 సెషన్ – 1లో నగరానికి చెందిన ఎసెంట్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. కళాశాలకు చెందిన డొంకా హరీష్ కుమార్ 99.93 శాతం మార్కులు సాధించారని కళాశాల డైరెక్టర్ జి.నాగేశ్వరరావు తెలిపారు.

మరో ఇద్దరు విద్యార్థులు ఆళ్ల నాగమోహన్ కృష్ణ, హర్షవర్ధన్ గిరి భౌతిక శాస్త్రంలో 100 శాతం మార్కులు సాధించారన్నారు. అలాగే కళాశాల నుంచి 99 శాతంతో 10 మంది, 90 శాతంతో 110 మంది విద్యార్థులు అర్హత సాధించారన్నారు.

కృష్ణా కళాశాలలో మాక్‌పోల్



మాక్ పోల్‌లో కృష్ణా కళాశాల అధ్యాపక బృందం

మద్దిలపాలెం : డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం సాధారణ ఎన్నికలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు మాట్లాడుతూ ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం మాక్‌పోల్ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

మహిళలకు అండగా వైఎస్సార్ చేయూత







లబ్ధిదారుల బయోమెట్రిక్ నమోదు చేస్తున్న వలంటీర్లు

- జోన్ – 3 పరిధిలో 8,146 మంది లబ్ధిదారులు
- మరోసారి నిధుల విడుదలకు బయోమెట్రిక్ నమోదు

ఎంవీపీ కాలనీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'వైఎస్సార్ చేయూత' పంపిణీ కార్యక్రమం అక్కచెల్లెమ్మలకు అండగా నిలుస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ చేయూత అందిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అర్హులైన మహిళలకు త్వరలో మరోసారి నగదు అందనుంది. ఈ నేపథ్యంలో చేయూత పథకం ద్వారా క్షేత్ర స్థాయిలో పెద్ద ఎత్తున ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుంటున్నట్లు పలువురు లబ్ధిదారులు వెల్లడిస్తున్నారు. చేయూతతోపాటు సున్నా వడ్డీ, ఆసరా, అమ్మ ఒడి పథకాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళల అభ్యున్నతికి, సంక్షేమానికి చేస్తున్న కృషిని కొనియాడుతున్నారు.

8,146 మంది లబ్ధిదారులు...

వైఎస్సార్ చేయూత లబ్ధిదారులు తూర్పు నియోజకవర్గం (జోన్ – 3) పరిధిలో 8,146 మంది ఉన్నారు. జోన్ – 3 పరిధిలో 14 వార్డులు ఉండగా 14వ వార్డులో 401, 15వ వార్డులో 584, 16వ వార్డులో 632, 17వ వార్డులో 471, 18వ వార్డులో 625, 19వ వార్డులో 1026, 20వ వార్డులో 384, 21వ వార్డులో 459, 22వ వార్డులో 659, 23వ వార్డులో 521, 24వ వార్డులో 466, 25వ వార్డులో 807, 26వ వార్డులో 483, 27వ వార్డులో 628 మంది లబ్ధిదారులు ఉన్నారు. గతంలో వైఎస్సార్ చేయూత పొందిన మహిళలతోపాటు కొత్త వారు నుంచి బయోమెట్రిక్ తీసుకునే ప్రక్రియ 90 శాతం పూర్తయ్యింది. త్వరలో కొత్త వారు అర్హత సాధించే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

ప్రోత్సాహం వెలకట్టలేనిది

చేయూత ద్వారా 45 ఏళ్లు దాటిన మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సాయం, ప్రోత్సాహం వెలకట్టలేనిది. దీని ద్వారా మా ఆర్థికాభివృద్ధికి బాటలు వేసుకుంటున్నాం. చిన్న చిన్న వ్యాపారాలకు ఆ నిధులు పెట్టుబడులుగా మార్చుకుంటున్నాం. ఇంటి అవసరాలకు అనుగుణంగా అన్నీ సమకూర్చుకుంటున్నాం. చేయూతతో మహిళలను ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు ధన్యవాదాలు.

– వాసుపల్లి పూర్ణ, లబ్ధిదారు

జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి

చేయూతతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో మహిళల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి. ప్రభుత్వం అందిస్తున్న రూ.18500తో చాలా మంది మహిళలు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్నారు. టైలరింగ్, చీరలు అమ్ముకోవడం, పండ్లు, కూరగాయల వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీంతోపాటు సున్నా వడ్డీ, అమ్మ ఒడి వంటి పథకాలు క్షేత్ర స్థాయిలో మహిళలకు కొండంత భరోసా కల్పిస్తున్నాయి.

– ఎం.దేవి, లబ్ధిదారు

సీఎం జగన్‌కు స్వాగతం



'ఆడుదాం ఆంధ్ర' ముగింపు వేడుకల్లో పాల్గొనేందుకు విశాఖ నగరానికి మంగళవారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎంపీ, విశాఖ తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు.

– ఆరిలోవ

లలితా పీఠంలో ప్రత్యేక పూజలు



లలితా పీఠంలో పూజలు చేస్తున్న భక్తులు



సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం

ఏయూక్యాంపస్ : శ్రీలలితా పీఠం వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 14వ తేదీన శ్రీపంచమిని పురస్కరించుకుని శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవికి అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహిస్తున్నారు. కలశస్థాపన, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రపాశుపత హోమం భక్తుల గోత్రనామాలతో నిర్వహించారు. మంగళవారం ఉదయం చండీహోమం, శ్రీ చక్రావరణార్చనతో పూజలు జరిపారు. అష్టోత్తర శత కలశాభిషేకం బుధవారం ఉదయం 8 గంటల నుంచి నిర్వహిస్తామని ఆలయ ప్రధాన పురోహితులు కాందూరి లక్ష్మణస్వామి తెలిపారు. అదే విధంగా మార్చి 8వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా సాయంత్రం 7 గంటలకు శ్రీ లలితా సుందరేశ్వరుల దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. స్థానిక పెదవాల్తేరులోని వేంకటేశ్వర స్వామి ఆలయ సముదాయంలో ఉన్న సుబ్రహ్మణ్య స్వామి, పంచముఖ ఆంజనేయునికి మంగళవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మాఘమాసం సందర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామికి రోజూ పంచామృతాభిషేకాలు నిర్వహిస్తున్నారు. రథసప్తమి రోజున సూర్యనారాయణ స్వామికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహిస్తామని తెలిపారు.

తూర్పులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తాం



పాదయాత్రలో చిన్నారితో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, తదితరులు



పార్టీ కార్యకర్త లక్ష్మమ్మ ఇంట్లో భోజనం చేస్తున్న ఎంవీవీ సత్యనారాయణ, తదితరులు

బీచ్‌రోడ్డు : రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణను గెలిపించి పార్టీ జెండా ఎగురవేస్తామని 22వ వార్డు ప్రజలు, కార్యకర్తలు నినదించారు. మంగళవారం ఆయన 38వ రోజు పాదయాత్రను 22వ వార్డులో కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రజలు నీరాజనం పలికి హారతులతో ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తన పాదయాత్ర కొనసాగుతుందన్నారు. రానున్న కాలంలో మరల ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, కార్పొరేషన్ల డైరెక్టర్లు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

19వ వార్డులో..

ఎంవీపీకాలనీ : ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ జనం కోసం.. జనంలోనే పేరిట చేపట్టిన పాదయాత్ర మంగళవారం 19వ వార్డులో కొనసాగింది. ప్రజల నీరాజనాలు అందుకుంటూ తూర్పు నియోజవకర్గంలో విస్తృతంగా ఈ యాత్ర కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ యాత్రలో భాగంగా ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ 19వ వార్డులోని పెదజాలరిపేటలో వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మితో పాటు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందరికి మంచి చేస్తున్నారన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమాన్ని చేరువ చేశారన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుకు సంక్షేమ పథకాలు అందించడంతో వైఎస్సార్‌సీపీకి ప్రజాదరణ పెరుగుతుందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి సంక్షేమ పాలనకు బ్రహ్మరథం పట్టాలని జాలరిపేట వాసులకు పిలుపునిచ్చారు. సందర్భంగా ఆ ప్రాంతానికి చెందిన లక్ష్మమ్మ ఇంట్లో పార్టీ శ్రేణులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

మద్దిలపాలెం : మద్దిలపాలెం మినీ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఏయూ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో క్రీడాకారులతో విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ మంగళవారం సందడి చేశారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత లక్ష్యం నిర్దేశించుకుని ముందడుగు వేయాలన్నారు. ఆసక్తి గల రంగంలో రాణించడానికి కృషి చేయాలన్నారు. క్రీడాస్ఫూర్తితో క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, నాయకులు గుడ్ల సత్యారెడ్డి, మువ్వల సురేష్, డి.రాజేష్, కాత్రాజురెడ్డి, కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 28వ వార్డులోని రామ్‌నగర్ వద్ద రూ. 19.90 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించబోయే బీటీ రోడ్డు పనులకు ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. ఇప్పటికే కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ డీఈ సత్యనారాయణ, తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు మొల్లి అప్పారావు, వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం



షిర్డీ సాయిబాబా పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆరిలోవ : చినగదిలి నార్త్ షిర్డీ సాయి బాబా ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా స్వామిని కాయిన్లు, పూలతో అలంకరించారు. వివిధ రకాల పండ్లు, 18 రకాల పిండి వంటలు స్వామికి సమర్పించారు. ఉదయం సుప్రభాత సేవ నుంచి సాయంత్రం స్వామి పల్లకీ సేవ, కాగడా హారతి వరకు ఘనంగా పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నాభిషేకంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో చినగదిలి, పెదగదిలి, సంతపాలెం, సూర్యతేజానగర్, ఆరిలోవ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయం కమిటీ చైర్మన్ వాసపల్లి అప్పారావు, జీవీఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత రమేష్‌బాబు, ఏయూ మాజీ అడిషనల్ రిజిస్ట్రార్ గవర రాజు తదితరులు కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

మానవ తప్పిదాలతోనే విపత్తులు



ప్రసంగిస్తున్న రెక్టార్ ఆచార్య సమత

ఏయూ క్యాంపస్ : విపత్తులకు మానవ తప్పిదాలు కూడా కారణమేనని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. ఏయూలోని మదన్ మోహన్ మాలవ్య టీచర్స్ శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న రీఫ్రెషర్ కోర్సును మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భౌగోళిక విపత్తులు, వాటి నుంచి రక్షణలో ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్‌ల పాత్ర వివరించారు. ముఖ్యంగా అడవుల నరికివేత, నగర జనాభావృద్ధి, పారిశ్రామిక అభివృద్ధి వంటివి పెను సవాళ్లుగా మారుతున్నాయన్నారు. తుఫానులు, భూకంపాలు, సునామీ వంటివి ప్రజల జీవనాన్ని నియంత్రిస్తున్న విధానాన్ని వివరించారు. కేంద్రం సంచాలకులు ఆచార్య టి.వి.కృష్ణ మాట్లాడుతూ రెండు వారాల శిక్షణలో భాగంగా అందించే నిపుణుల ప్రసంగాల వివరాలు, ప్రాధాన్యత తెలియజేశారు. కోర్సు సమన్వయకర్త ఆచార్య సి.వి. నాయుడు మాట్లాడుతూ భౌగోళిక విపత్తులు, వాటి నిర్వహణను వివరించారు. అధ్యాపకులు విపత్తుల నిర్వహణలో వలంటీర్లుగా మారాల్సిన ఆవశ్యకత, విద్యార్థులకు వీటిపై అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని తెలియజేశారు. శిక్షణ కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

శ్రీరాముడి హృదయానంద స్వరూపం 'హనుమంతుడు'



హనుమత్ వ్రతంలో పాల్గొన్న భక్తులు



ప్రవచనాలు చెబుతున్న షణ్ముఖ శర్మ

ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖ శర్మ

ఎంవీపీ కాలనీ: శ్రీరాముడి హృదయానంద స్వరూపం హనుమంతుడు అని ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. హనుమద్వైభవ ప్రవచనాలు ఎంవీపీ కాలనీలో మంగళవారం కొనసాగాయి. ఎంవీపీ కాలనీలోని ఏబీసీ పార్కు వేదికగా షణ్ముఖ శర్మ హనుమాన్ చాలీసా వ్యాఖ్యానంతో హనుమద్వైభవ ప్రవచనాలు కొన్ని రోజులుగా కేవీఎస్ శ్యామ్, అరుణ గాయత్రి దంపతుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా షణ్ముఖశర్మ మాట్లాడుతూ మనోనిబ్బరానికి నిలువెత్తు నిదర్శనంగా, వేదాంత విద్యను ఎరిగిన వాడిగా, జ్ఞానంతో ఉన్నత విలువలు కలిగిన వాడిగా హనుమాన్ ప్రసిద్ధి చెందాడన్నారు. రాగ, ద్వేషాలకు అతీతంగా కర్తవ్యాన్ని ఆచరించగల సమర్థత ఆయన సొంతమన్నారు. శ్రీరాముడి కార్యాచరణలో హనుమంతుని పాత్ర ప్రత్యేకమన్నారు. ప్రపంచంలోని అరుదైన అద్భుత ఔషధాలు ఆయుర్వేదం రూపంలో మన దేశంలో ఉన్నాయన్నారు. సంజీవని పర్వతాన్ని తెచ్చి లక్ష్మణుడికి ప్రాణదానం చేసిన కర్తవ్యసాధకునిగా హనుమంతుడు నిలిచారన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన హనుమత్ వ్రతంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మంగళవారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రవచనాలు అనంతరం భక్తులు షణ్ముఖ శర్మ ఆశీస్సులు తీసుకున్నారు.

సమ్మె జయప్రదం చేయాలి

ఆరిలోవ: కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న చేపట్టనున్న జాతీయ సమ్మె జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ కోరారు. జీవీఎంసీ పదో వార్డు పరిధి రవీంద్రనగర్‌లో మంగళవారం సీఐటీయూ ఆరిలోవ జోన్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ఈ నెల 16న దేశవ్యాప్తంగా పారిశ్రామిక సమ్మె, ట్రాన్స్‌పోర్టు, గ్రామీణ బంద్‌కు అఖిల పక్ష కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చాయన్నారు. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం వల్ల రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులు అందరికీ అన్యాయం జరుగుతుందన్నారు. ఇలాంటి సమస్యలపై పోరాటానికి జాతీయ సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ ఆరిలోవ జోన్ నాయకులు పాల్గొన్నారు.

విజయవంతంగా 'జగనన్న సురక్ష' శిబిరాలు

మహారాణిపేట: రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం భీమిలి మండలం పాట్నూరు, పద్మనాభం మండలం రేవిడి, ఆనందపురం మండలం గంభీరం గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలను డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ శిబిరాల్లో మొత్తం 1,515 మంది రోగులు పేర్లు నమోదు చేసుకోగా.. ఉచిత వైద్య సేవలు అందించారు. అవసరమైన మందులు అందజేశారు. పలువురికి నేత్ర పరీక్షలు చేశారు. కంటి శుక్లాలను గుర్తించి ఉచితంగా ఆపరేషన్ చేసి కళ్లద్దాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఆరుగురిని మెరుగైన వైద్యం కోసం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫరల్ చేశారు. రోగులకు డీఎంహెచ్‌వో కిట్స్ పంపిణీ చేశారు.

నేడు 12 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు

నగర పరిధిలో 12 ప్రాంతాల్లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నారు. ఆదర్శనగర్, పురుషోత్తపురం, చంద్రనగర్, న్యూగాజువాక, గిరిజా కాలనీ, బాపూజీనగర్, అంబేద్కర్‌నగర్, ఏఎస్‌ఆర్ నగర్, కొబ్బరితోట, లాసన్స్‌బే కాలనీ, బక్కన్నపాలెం, బాలాజీనగర్‌లలో ఈ వైద్య శిబిరాలు జరుగుతాయని డీఎంహెచ్‌వో తెలిపారు.

ఇంట్లో నగదు చోరీ

బీచ్‌రోడ్డు: ఓ ఇంటిలో రూ.40 వేలు చోరీకి గురైనట్లు మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈస్ట్‌పాయింట్ కాలనీలో నివసించే దీప్ ధన్వానీ ఆదివారం రాత్రి 11:30 గంటలకు ఇంటి ప్రధాన ద్వారం ముసుకొని నిద్రపోయాడు. మరోసాటి రోజు సోమవారం ఉదయం లేచి చూసే సరికి తలుపు తెరిచిఉండటాన్ని గమనించాడు. ఇల్లు మొత్తం పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తులు కిటికీ బోల్ట్ తొలగించి లోపలకి ప్రవేశించి రూ.40 వేలు నగదు దొంగలించి ప్రధాన ద్వారం తాళం తొలగించి వెళ్లిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'ఇన్‌స్పైర్ మనక్'లో 200 ప్రాజెక్టుల ఎంపిక

విశాఖ విద్య: ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగం మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో 200 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఒక్కో విద్యార్థి రూ.10 వేలు ప్రోత్సాహకం అందుకోనున్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను జిల్లాల వారీగా సిద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నగదు ప్రోత్సాహకం అందించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సామాజిక అంశాలే ప్రధానం

మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతీ ఏటా పాఠశాల స్థాయిలో 'ఇన్‌స్పైర్ మనాక్' పేరిట విద్యార్థుల్లో సృజనాత్మకతపై పోటీలను నిర్వహిస్తోంది. సామాజిక అంశాలు, సమాజాభివృద్ధికి దోహదపడే వినూత్నమైన ఆలోచనలకు రూపం ఇచ్చేలా ఎలాంటి ప్రాజెక్టులను తయారు చేస్తామనే అంశంపై విద్యార్థులు తమ ఐడియాను నమోదు చేయాల్సి ఉంటుంది. ఇలా ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 2023–24 విద్యా సంవత్సరానికి 2,680 మంది పేర్లు నమోదు చేసుకోగా, ఇందులో 200 మంది ఎంపికయ్యారు. విద్యార్థులు తమకు అందిన రూ.10 వేల నగదు ప్రోత్సాహకాన్ని వినియోగించుకుని, ప్రాజెక్టుకు అవసరమయ్యే సామగ్రిని సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి కె.ప్రసాద్ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థుల పేర్లతో బ్యాంక్ అకౌంట్ తెరవాలని సూచించారు. దీనిపై ఆయా పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలన్నారు.

రేపు జిల్లా స్థాయి సైన్సు ఫెయిర్

విశాఖ విద్య: జిల్లా స్థాయి సైన్సు ఫెయిర్ ఈ నెల 15న నిర్వహించనున్నట్లు జిల్లా సైన్సు అధికారి కె. ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గాజువాక కణితి రోడ్‌లోని ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ వేదికగా నిర్వహిస్తున్న ప్రదర్శనకు జిల్లాలో 65 ప్రాజెక్టులు ఎంపికైనట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులతో విద్యార్థులు, సైన్సు ఉపాధ్యాయులు సకాలంలో హాజరు కావాలని ఆయన సూచించారు. జిల్లా స్థాయిలో ఉత్తమంగా నిలిచిన ఏడు ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

రాంనగర్‌లో లేపాక్షి ఎంపోరియం ప్రారంభం



షోరూంలో ఏపీహెచ్‌డీసీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

దాబాగార్డెన్స్: రాంనగర్‌లో లేపాక్షి ఎంపోరియం రెండో షోరూం, ఆప్కో మంగళవారం ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అఖిల భారత వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి కొత్త స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో విశాఖపట్నంలో లేపాక్షి రెండో షోరూం ప్రారంభించామన్నారు. ఎంపోరియం ఏర్పాటుకు కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున కృషి చేశారన్నారు. త్వరలోనే వైఎస్సార్ జిల్లా గండికోటలో నూతన లేపాక్షి ఎంపోరియం ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. ప్రతీ జిల్లా ప్రధాన కేంద్రంలో వైఎస్సార్ చేతివృత్తుల బజార్ల ఏర్పాటుకు సంబంధించిన ఫైల్ ముఖ్యమంత్రికి పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో లేపాక్షి మేనేజర్ కార్తీక్, ఆప్కో సిబ్బంది పాల్గొన్నారు.